జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



# కోర్టు తీర్పు ఉన్నా.. కంబిరిగాంలో..

# భూదోపిడీ



* రూ.1000 కోట్ల ల్యాండ్ సీలింగ్ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను
* అడంగల్, 1బి పేరిట తమకే ఉన్నాయంటూ హల్‌చల్ చేస్తున్న ల్యాండ్‌మాఫియా
* జాతీయ రహదారి పక్కనే అక్రమ వెంచర్లు
* కొందరు రెవెన్యూ అధికారులతో మాఫియా కుమ్మక్కు

**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** పలాస మండలం కంబిరిగాంలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ పోరాటానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పుతో ముగింపు వచ్చినా, భూ దోపిడీ మాత్రం ఆగడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంబిరిగాం రైతులు, పరశురాం చౌదరి కుటుంబీకుల మధ్య కొనసాగిన సుదీర్ఘ న్యాయపోరాటంలో మొత్తం 254.30 ఎకరాల భూములపై హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు ప్రకారం 129.76 ఎకరాల ఇనామ్ భూములు రైతులకు, 124 ఎకరాలు పరశు రాం చౌదరి కుటుంబీకులకు కేటాయించబడాయి. కంబిరిగాం మాత్రమే కాకుండా మురుకుంటి భద్ర, వీరభద్రాపురం, తలగాం, కాశీబుగ్గ, దిమ్మిలాడ, పాత నౌపడ, రాజగోపాలపురం, కేసుపురం, పారసంబ, ఉదయపురం గ్రామాల్లో కూడా ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నట్లు అధికారిక రికార్డులే చెబుతున్నాయి. హైకోర్టు జడ్జిమెంట్ ప్రకారం మొత్తం 480 ఎకరాల భూముల్లో ఆయా గ్రామాల రైతులకు 78.73 ఎకరాలు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 401 ఎకరాలు ప్రభుత్వ స్వాధీనం కావాల్సి ఉండగా, కంబిరిగాంలో జరిగిన భూ ఉద్యమ నేపథ్యంతో 126 ఎకరాల ఇనామ్ భూములను రైతులకు ఇచ్చారు.

## 275 ఎకరాల భూములు ఎవరి చేతుల్లోకి?

మిగిలిన 275 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ లోపును ఆసరాగా చేసుకుని టీడీపీకి చెందిన చోటా మోటా నేతలు, అధికార పార్టీ నేతల అండదండలతో ప్రైవేట్ వ్యక్తులు రంగంలోకి దిగారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ల్యాండ్ సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వడానికి చట్టపరంగా అవకాశం లేకపోయినా, రెవెన్యూ అధికారులు పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుని అడంగల్, 1బి పత్రాలు జిరాయితీ భూముల్లా తయారు చేసి ఇస్తున్నారని ఆరోపణలు తీవ్రమవుతున్నాయి.



## ప్రభుత్వం గెలిచింది... అధికారులు ఓడించారు!

ల్యాండ్ సీలింగ్ భూముల పరిరక్షణ కోసం జిల్లా కలెక్టర్ స్థాయి అధికారులు ఏళ్ల తరబడి కోర్టుల్లో పోరాడగా... చివరకు తీర్పు ప్రభుత్వానికే అనుకూలంగా వచ్చింది. కానీ, అదే ప్రభుత్వ భూములను స్థానిక రెవెన్యూ అధికారులు సొమ్ము లిచ్చినోడికి, అడిగినోడికి అడిగినంత మ్యుటేషన్ చేసి, లక్షల్లో దండుకుని భూ పత్రాలు అప్పనంగా ఇచ్చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలాస మండలం కంబిరిగాం గ్రామానికి చెందిన జి. నరేష్ అనే యువకుడు స్పందించాడు. ప్రభుత్వ భూములు ప్రభుత్వానికే చెందాలంటూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశాడు. దీనిపై IA No.3 of 2024 రావడంతో ల్యాండ్ సీలింగ్ భూములకు తాత్కాలిక రక్షణ లభించినట్లు తెలుస్తోంది.

## జాతీయ రహదారి పక్కనే... వెంచర్ల దందా!

అధికార పార్టీ నేతల అండదండలతో జాతీయ రహదారి సమీపంలో ఉన్న సుమారు రూ.1000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై రియల్టర్లు కన్నేశారు. ల్యాండ్ సీలింగ్ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి, వెంచర్లు వేసి ప్లాట్లుగా విభజించి అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూములు కొనుగోలు చేసే వారు చివరికి డబ్బులు కోల్పోయే ప్రమాదం, న్యాయపరమైన చిక్కులు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## 'అవినీతికి కేరాఫ్ అడ్రస్'గా ప్రభుత్వ కార్యాలయాలు..

ల్యాండ్ సీలింగ్ భూములకు అడంగల్, 1బి పత్రాలు ఇస్తున్న పలాస తహశీల్దార్ కార్యాలయం, అలాగే ల్యాండ్ సీలింగ్ భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్న కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌లుగా మారాయని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అక్రమ అడంగల్--1బి పత్రాలను రద్దు చేసి, ల్యాండ్ సీలింగ్ భూములను పూర్తిగా ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని ప్రాంత ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

### పాలనాయుడుపేటలో

# అక్రమ లేఅవుట్

* కోర్టు పరిధిలో ఉన్న అనధికార అమ్మకాలు
* గ్రామకంఠం భూమి ఆక్రమించారని గ్రామస్తులు మరో ఫిర్యాదు

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 28 (వార్త):** రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగిస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్నదని, గ్రామకంఠం భూమి ఆక్రమించాలని వేరువేరుగా ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెట్రేగి పోతున్నారు. వివరాల్లోకి వెళితే నౌపడ పంచాయితీ పాలనాయుడుపేటలో ఎల్ పి నెంబర్ 324,325లో 80 సెంట్లలో లేఅవుట్ ను వేశారు. ఈ లేఅవుట్‌కు ఎటువంటి పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకపోయినా దర్జాగా రోడ్డులు వేసి పాట్లుగా విభజించి సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సర్వే నెంబర్ పై డిస్ప్యూట్ ఉండడంతో కోర్టులో కేసును వేశారు. కోర్టు కాపీతో పాటు భూపత్రాలను స్పందనలో తాసిల్దార్ హేమ సుందర్ రావుకు కె.కుసుమ రెడ్డి ఫిర్యాదు చేశారు. మరోపక్క గ్రామకంఠం భూమి ఆక్రమించి లేఅవుట్ వేశారని గ్రామానికి చెందిన పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు పిన్నింటి. ఇండియా రెడ్డి గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సర్వే నెంబర్ పై ఇన్ని ఫిర్యాదులు ఉన్న మూలపేట పోర్టును బూచిగా చూపించి లే అవుట్‌ను ఫ్లాట్లుగా విభజించి అమ్మకాలను చేపడుతున్నారు. ఒక్కొక్క ఫ్లాట్‌ను లక్షల రూపాయలకు విక్రయించేస్తున్నారు. ఈ తతంగం అంతా అధికారులకు తెలిసిన ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, తదితరులు కోరుతున్నారు.



### ఫిర్యాదు చేశాను..

మా గ్రామంలో వేసిన లే అవుట్‌లో గ్రామకంఠం భూమిని ఆక్రమించారు. అమ్మకాలు కూడా చేపడుతున్నారు. దీనిపై గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కి ఫిర్యాదు చేశాను.

**-పిన్నింటి ఎండయ్య రెడ్డి, మాజీ పిఏసిఎస్ అధ్యక్షుడు, సంతబొమ్మాళి**

### చర్యలు తీసుకుంటాం..

పాల నాయుడుపేటలో వేసిన లేఅవుట్ లో గ్రామకంఠం భూమి ఆక్రమించారని ఫిర్యాదు అందింది. రికార్డులు పరిశీలించి సర్వే చేసి చర్యలు తీసుకుంటాం.

**-ఉప్పాడ ఉమాపతి పంచాయతీ కార్యదర్శి, నౌపడ గ్రామసచివాలయం**

### పరిశీలిస్తాం..

వేసిన లేఅవుట్‌ను పరిశీలిస్తాం. దీనికి సంబంధించి కోర్టులో కేసు వేసిన పత్రాలతో పీజేఆర్ఎస్‌లో ఫిర్యాదు కూడా చేశారు.

**-హేమ సుందర్ రావు, తాసిల్దార్, సంతబొమ్మాళి**

# పెన్షన్ సొమ్ముతో పరార్

* వసప సచివాలయ జేఎల్ఎం నిర్లక్ష్యం
* రూ.1.56 లక్షల నగదుతో పరారైన జేఎల్ఎం స్నేహితుడు
* నిందితుడిని, సిబ్బందిని అదుపులోకి తీసుకున్న కొత్తూరు పోలీసులు

**కొత్తూరు, ఫిబ్రవరి 28 (వార్త):** మండలంలోని వసప గ్రామ సచివాలయ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీ ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ నగదు అందించాలనే లక్ష్యంతో ఉండగా, వసపలో మాత్రం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 32 మంది లబ్ధిదారులకు శనివారం ఉదయం వరకు పెన్షన్లు అందలేదు. వసప సచివాలయంలో జూనియర్ లైన్ మెన్ (జేఎల్ఎం) గా విధులు నిర్వహిస్తున్న కొల్ల సాయి వరుణ్ తనకు కేటాయించిన 32 మంది లబ్ధిదారులకు పంచాల్సిన రూ. 1.56 లక్షల నగదును శుక్రవారమే బ్యాంకు నుండి విత్ డ్రా చేశారు. శనివారం తెల్లవారుజామున పంపిణీ చేయాల్సి ఉండటంతో, ఆయన శుక్రవారం రాత్రి నివగాం విద్యుత్ సబ్ స్టేషన్‌లో బస చేశారు. సాయి వరుణ్ వెంట ఆయన స్నేహితుడైన వసప గ్రామానికి చెందిన సొండి చంటి అనే యువకుడు కూడా అక్కడే నిద్రపోయాడు. అయితే ఆ రాత్రి వీరిద్దరూ కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. సాయి వరుణ్ గాఢ నిద్రలో ఉండగా, అర్ధరాత్రి సమయంలో సొండి చంటి నగదు ఉన్న బ్యాగుతో పరారయ్యాడు. శనివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి డబ్బులు మాయం కావడంతో సాయి వరుణ్ నిర్ఘాంతపోయాడు. ఉదయం 11 గంటలైనా వసప సచివాలయ పరిధిలో పెన్షన్ల పంపిణీ లాగిన్ కాకపోవడంతో మండల పరిషత్ అధికారులు ఆరా తీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాయి వరుణ్ కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన స్థానిక ఎస్సై కె. వెంకటేష్, నగదు అపహరించిన సొండి చంటితో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన సాయి వరుణ్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, కలెక్టర్ లాగిన్‌లో వసప పెన్షన్ల పంపిణీ సున్నా శాతంగా కనిపిస్తుండటంతో, అధికారులు మిగిలిన సిబ్బంది వద్ద ఉన్న నగదుతో కొందరికి పంపిణీ చేసి సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనపై కొత్తూరు ఎంపీడీఓ బి.వి.ఆర్. ప్రసాద్ రావు స్పందిస్తూ, నగదు అపహరణ వాస్తవమేనని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.




# విధుల నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా?

* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం
* క్షేత్రస్థాయి అధికారుల తీరుపై ఎమ్మెల్యే గొండు శంకర్ అసహనం
* పైపులైన్ కనెక్షన్లు, పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులతో సమీక్ష

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 28 (వార్త):** ప్రజారోగ్యం ప్రమాదంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాల్సిన వారు ఎందుకు విఫలమవుతున్నారు? ఎవరు చేయాల్సిన పనులు వారు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.. అంటూ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలెక్టర్, ఎమ్మెల్యే గొండు శంకర్ కలిసి అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంచినీటి సరఫరా వ్యవస్థలో లోపాలు, అక్రమ పైపులైన్ కనెక్షన్ల విషయంలో అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. పారిశుధ్య నిర్వహణలో వైఫల్యాలు కనిపిస్తున్నాయని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించడం వల్లే డయేరియా వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. నగరంలో ప్రజల సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పైపులైన్ల లీకేజీలు, మురుగునీటి కాలువల పూడికతీత పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్






కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డయేరియాపై ఆందోళన వద్దు

**- డైరక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె. పద్మావతి**

డయేరియాపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె. పద్మావతి వెల్లడించారు. శనివారం డయేరియా ప్రభావిత దమ్మలవీధి, కాకివీధి, బోడెమ్మ కోవెల, తదితర అతిసార ప్రభావిత ప్రాంతాలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతిసారం తగ్గుముఖం పట్టిందని, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రతీ ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. బయట ఆహార పదార్థాలను తినరాదని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధికి గల కారణాలను గూర్చి అతిసార వ్యాధి నియంత్రణ గూర్చి తీసుకోవాల్సిన తగు చర్యలు గూర్చి వైద్యాధికారులతో సమీక్షించారు. గవర్నమెంటు జనరల్ ఆసుపత్రిని సందర్శించి అతిసార బాధితుల యొక్క ఆరోగ్య పరిస్థితిని గూర్చి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పట్టేంతవరకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ప్రజలుకి అందుబాటులో ఉంటూ వ్యాధి నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జాయింట్ డైరెక్టర్ ఐ.డి.ఎస్.పి డా. ఎన్.మల్లేశ్వరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డా. అనిత పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# పెన్షన్లతో పేదలకు భరోసా



**మందస, ఫిబ్రవరి 28(వార్త):** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పేదలకు భరోసా కలుగుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ బత్తిని తారకరత్న అన్నారు. మందస మండలంలోని అంబుగాం పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదల జీవితాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల హామీ ప్రకారం పింఛన్లు పెంచారన్నారు. పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీషమ్మ సూచన మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు స్థానిక కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రాధా గోవిందస్వామి డోలోత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన సీఐ



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 28(వార్త):** మెళియాపుట్టిలోనున్న రాధాగోవింద స్వామి ఆలయానికి సంబంధించి మార్చి రెండవ తేదీ నుండి జరగనున్న డోలోత్సవాల నేపథ్యంలో పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు శనివారం ఆలయాన్ని సందర్శించి, అక్కడ చేపడుతున్న ఏర్పాట్లు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్శనలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు తోపాటు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ అమీర్ అలీలు కలసి మెళియాపుట్టి రాధాగోవిందస్వామి ఆలయ పరిసరప్రాంతాలు, ఉయ్యాల మండపం, కామదహనం నిర్వహించనున్న ప్రదేశాలను పరిశీలించారు. ఇక్కడ తొమ్మిది రోజులు పాటు జరిగే డోలోత్సవాల్లో చేపట్టే అంశాలను పూజారి, స్థానికంగా అక్కడ ఉన్న గ్రామస్తులకు వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు వచ్చే భక్తులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది అసౌకర్యాలు లేకుండా తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ప్రతి ఒక్కరు కూడా పోలీసు లకు సహకరించాలని కోరారు.

## ఏడీఆర్ఎం రామారావును కలిసిన నవోదయ అధ్యాపకులు



**మందస/ సోంపేట, ఫిబ్రవరి 28(వార్త):** వాల్తేర్ డివిజన్ రైల్వే డివిజనల్ అదనపు మేనేజర్ కుందు రామారావు విండో ట్రైలింగ్ ఇన్స్పెక్షన్ చేస్తున్న సమయంలో పర్లా ఖెముండి రైల్వే స్టేషన్ వద్ద జవహర్ నవోదయ విద్యాలయ ఉపాధ్యాయులు దామోదరరావు, కులదీప్, యోగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ప్రయాణించిన ప్రత్యేక బోగీలోకి వెళ్ళి, పుష్పగుచ్ఛంతో అందించారు. నవోదయ ఉపాధ్యాయులతో కాసేపు ముచ్చటించిన రామారావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది వేసి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరారు. నవోదయ విద్యాలయాలు పేద విద్యార్థులకు ఒక అద్భుతమైన వరమని అన్నారు. ఉపాధ్యాయులంటే తనకు ఎంతో గౌరవం అని విద్యార్థుల్లో సృజనాత్మకత, నైతిక విలువలు పెంపొందించాలని పలు సూచనలు చేశారు. మీ సూచనలు తప్పనిసరిగా పాటిస్తామని, రామారావుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## అన్నా క్యాంటీన్ పరిశీలించిన ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ




**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** పలాస మున్సిపాలిటీ పరిధిలోని అన్నా క్యాంటీన్ ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తినడానికి వచ్చిన వాళ్లతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి అల్పాహారం రుచి చూశారు. సిబ్బందితో మాట్లాడి పరిసరాలు, త్రాగునీరు శుభ్రంగా ఉంచుకోవాలని, భోజనానికి వచ్చేవారికి గౌరవంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సప్ప నవీన్, తెలుగుదేశం నాయకులు కొత్త సత్యం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సైన్సు డే వేడుకలు

**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 28 (వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో జాతీయ సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో సైన్స్ డే సందర్భంగా సైన్సు ఉపాధ్యాయుడు రవికుమార్ కి స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కె.సి. పూరి శంకర్, పద్మజ, శ్రీధర్, రాజ్యలక్ష్మి, శాంతి, యశోద, పార్వతి, సరోజినీ, జయలక్ష్మి, శిరీష, ప్రియ దర్శిని ఎస్ పి యల్స్ జిహారిక, యువశ్రీ ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియ, సెక్రటరీ డి. హర్ష వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైన్సు డే వేడుకలు నిర్వహించారు.రవీంద్ర భారతి లో ప్రిన్సిపాల్ జి కె నాయుడు ఆధ్వర్యంలో సైన్సు డే వేడుకలు నిర్వహించారు.పంజా వీధి పాఠశాలలో హెచ్ ఎం భాస్కర్ రావు ఆధ్వర్యంలో సైన్సు డే వేడుకలు నిర్వహించారు.




# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే శిరీష దృష్టి

### -వేసవి నీటి ఎద్దడి,
### డయేరియా నివారణపై ముందస్తు సమీక్ష

**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, పలాస నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముందస్తు చర్యలు చేపట్టారు. పలాస నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, ప్రజారోగ్యం వంటి కీలకమైన అంశాలపై సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యమని చాటుతూ, సమస్యలు తలెత్తక ముందే వాటిని పరిష్కరించే దిశగా అధికారులను పరుగులు పెట్టించారు.

### వేసవిలో నీటి కష్టాలు రానీయొద్దు..

శనివారం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబి, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులతో ఎమ్మెల్యే శిరీష సమావేశమయ్యారు. రాబోయే ఎండాకాలంలో నియోజకవర్గంలో ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకూడదని ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. "ప్రస్తుతం నీటి సరఫరా ఎలా ఉంది? ఎక్కడైనా సమస్యలు ఉన్నాయా? ఉంటే, తక్షణమే ఎందుకు పరిష్కరించలేదు?" అని అధికారులను నిలదీశారు. సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆమె గట్టిగా ఆదేశించారు.

### ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..
### డయేరియా నివారణకు చర్యలు:

నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో డయేరియా ప్రబలుతోందన్న వార్తలపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. ఇది ఆందోళన కలిగించే విషయమని, ప్రజారోగ్యం విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి, పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని, వ్యాధి వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

### అభివృద్ధి పనులలో వేగం పెంచండి..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్.ఆర్.ఇ.ఈ. జిఎస్) నిధుల ద్వారా మంజూరైన రోడ్ల పనుల పురోగతిపై కూడా ఎమ్మెల్యే సమీక్షించారు. పనులు ఎంతవరకు వచ్చాయి, ఇంకా ఎందుకు జాప్యం జరుగుతోందని ఆర్‌డబి, పంచాయతీ రాజ్ అధికారులను ప్రశ్నించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యు ఎస్ డీఈ



సూర్యనారాయణ, ఆర్ అండ్ బి జేఈ విక్రమ్, జగదీష్, పంచాయతీ రాజ్ డీఈ జి. రవిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా, ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి, వారి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే శిరీష నాయకత్వ పటిమపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షాలు సైతం ఆమె పనితీరును గమనించేలా, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ఆమె చూపుతున్న చొరవ నిదర్శనంగా నిలుస్తోంది.

# కె.నారాయణలో పిల్లల పెంపకంపై నేడు ప్రత్యేక సదస్సు

### - డాక్టర్ మాకేన సతీష్‌తో పేరెంటింగ్ సెషన్
### -పిల్లల్ని పెంచడం ఒక అద్భుత కళ
### -సద్వినియోగం చేసుకోవాలన్న
### కరస్పాండెంట్ గుంట రోహిణిశంకర్



**మందస, ఫిబ్రవరి 28(వార్త):** పిల్లల పెంపకంపై కుంటికోట కె.నారాయణలో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ గుంట రోహిణీశంకర్ చెప్పారు. మందస మండలంలోని కుంటికోటలో గల సూర్యనగర్ లోని కె.నారాయణ హై స్కూలులో మార్చి 1న డాక్టర్ మాకేన సతీష్ తో పేరెంటింగ్ సెషన్ జరుగుందన్నారు. పిల్లల్ని పెంచడం ఒక అద్భుత కళ అని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత కాలంలో పిల్లల పెంపకం తల్లిదండ్రులకు ఒక ముఖ్యమైన బాధ్యతగా మాత్రమే కాకుండా ఒక సవాల్‌గా మారిందన్నారు. మొబైల్ ఫోన్ల ప్రభావం, చదువుపై ఆసక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు, భావోద్వేగ సమస్యలు వంటి అంశాలు చాలా కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కుంటికోటలోని కె.నారాయణ హై స్కూల్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించబడుతోందన్నారు. ఈ కార్యక్రమానికి పిల్లల్ని పెంచడం ఒక అద్భుత కళ అనే శీర్షికను నిర్ణయించామని, ఈ కార్యక్రమం మార్చి 1, 2026 (ఆదివారం) ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు కె.నారాయణ హై స్కూల్ ప్రాంగణంలో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రముఖ పేరెంటింగ్ ఎక్స్పర్ట్, సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ మకేన సతీష్ హాజరై తల్లిదండ్రులకు సులభమైన, ఆచరణలో పెట్టగల సూచనలు అందించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా పిల్లల మనస్తత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి.. మొబైల్ వినియోగాన్ని ఎలా నియంత్రించాలి.. చదువుపై దృష్టిని ఎలా పెంపొందించాలి.. తల్లిదండ్రులు-పిల్లల మధ్య బలమైన అనుబంధాన్ని ఎలా నిర్మించాలి.. పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంచాలి.. అనే అంశాలపై వివరంగా చర్చించబడుతుందన్నారు. హాజరయ్యే ప్రతీ తల్లిదండ్రులకు అల్పాహారం, టీ, భోజన సదుపాయం కల్పించబడుతుందని, కార్యక్రమం ముగింపులో హాజరైన తల్లిదండ్రులలో ఒకరిని లకీ పేరెంట్ గా ఎంపిక చేసి ప్రకటించబడుతుందన్నారు. తల్లిదండ్రులు అందరూ ఆహ్వానితులేనని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులు, పిల్లలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ విషయాన్ని తెలియజేయాలని పాఠశాల యాజమాన్యం కోరుతోందన్నారు. పిల్లల భవిష్యత్తు బలంగా ఉండాలంటే, తల్లిదండ్రుల అవగాహన మరింత బలంగా ఉండాలి అనే నమ్మకంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోందన్నారు. మరిన్ని వివరాలకు కె.నారాయణ హై స్కూల్, కుంటికోట.. 7013872313, 6305930845, 9550291210 అనే ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## రాపిడ్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ




**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** లలిత శ్రీ క్రియేషన్ బ్యానర్ పై బొత్స రాము స్వీయ రచన దర్శకత్వంలో రాపిడ్ సినిమా పోస్టర్‌ను జనసేన ఇంచార్జ్ విసనగిరి శ్రీనివాస రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లికార్జున నాయుడు ఆ ఆవిష్కరించారు. ఏపీ తెలుగు ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ మాట్లాడుతూ బెట్టింగ్ వలలో చిక్కుకున్న ఓ యువకుడు చివరకు రాపిడో లో జాయిన్ అయి జీవన పోరాటం సాగించిన ఘట్టాలు చక్కగా చిత్రీకరించారని అన్నారు. చిత్రంలో నటీనటులుగా డాక్టర్ కుమార్ నాయక్ ,జబర్దస్త్ టీం రైజింగ్ రాజు, గుండు మురళి, త్రినాధ ,గడ్డం నవీన్, కుమారి యామిని, శ్రీనివాసరావు జూనియర్ పవన్ కళ్యాణ్ నరేష్, నటించగా ప్రొడక్షన్ బొత్సకార్తీక్ పర్యవేక్షించారు.

## విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం తప్పనిసరి

### -ప్రముఖ న్యాయవాది జీఎస్ శైలేంద్ర




**మందస, ఫిబ్రవరి 28(వార్త):** విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు మెడిటేషన్ ను అలవాటు చేసుకోవాలని హార్ట్ ఫుల్ ప్రాక్టీషనర్, ప్రముఖ న్యాయవాది జీఎస్ శైలేంద్ర(సోంపేట) తెలిపారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసిక ప్రశాంతత, ధైర్యం, సమయపాలన నిర్వహించేందుకు మెడిటేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మెడిటేషన్ ను జీవితంలో ఒక భాగం చేసుకోవడం వలన ఏకాగ్రత పెరుగుతుందని, ఆందోళన తగ్గి ఆత్మవిశ్వాసం మెరుగవుతుందన్నారు. మనసు ప్రశాంతంగా ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల విద్యార్దినులచే 30నిమిషాల పాటు ధ్యానం చేయించారు. ఆయనతో పాటు జి.సుధా విద్యార్థినులకు మెడిటేషన్ పై అవగాహన కల్పించారు. గత మూడు రోజులుగా ఆ పాఠశాల విద్యార్థినులకు అవగాహనతో పాటు ధ్యానం చేయించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలి

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 28 (వార్త):** ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా అంగనవాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ సెషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా యువసూర్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ న్యాయవాది రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు, పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని, అలానే క్రమశిక్షణ తో మిషన్ శక్తి వంద రోజుల అవగాహన ప్రచారం శిక్షణ తీసుకుంటూ, దానిని అవగాహన చేసుకుని, ప్రజలకు చేరవేయాలని అని కోరారు. పోక్సో చట్టం, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా నర్తు ప్రేమ్ జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 28(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా కార్యక్రమం స్వేచ్ఛావతి అమ్మవారి గుడి దగ్గర పూజలు చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాజా వారి గ్రౌండ్ ఎదురుగా ఉన్న పార్టీ కార్యాలయం వైసీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గం ఇంచార్జి సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, వైసీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్‌తో కలసి నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ కార్యకర్తలు, అభిమానులు మధ్య కేక్ కట్ చేసి, అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో వేడుకలు లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సల్లా దేవరాజు, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఇసురు తులసీరామ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, మడ్డు అభి యాదవ్, మాజీ జడ్పీటీసి దక్కత నూకయ్య రెడ్డి, బార్ల నాగభూషణం, డొక్కరి బలరామ్ ఆసి పురుషోత్తం రెడ్డి, ఆసి క్రిష్ణారెడ్డి, సర్పంచ్లు నర్తు వరప్రసాద్ యాదవ్ పలికల జయరామ్ రెడ్డి, సాడి గురుమూర్తి రెడ్డి, కుందేశీ ప్రియా, బాకి లక్ష్మి నారాయణ, దుక్క ధనలక్ష్మి, నీలాపు సారధి రెడ్డి, నీలాపు జగదీష్ రెడ్డి, పాలిన ప్రవీణ్ యాదవ్, ధర్మరావు, సాలిన లక్ష్మణ మూర్తి యాదవ్, వడ్డిన తేజ, భాస్కర్ రెడ్డి, సప్ప వంశీ యాదవ్, బోరుపద్ర పాపయ్య యాదవ్, నర్తు శ్రీను, రాపాక భాస్కర్ యాదవ్, బదకల భాస్కర్, నర్తు భానోజిరావు యాదవ్, హంగీర్ బెహరా, ఉదయ్ బెహరా, బోనమాలి బెహరా, అనపాన శ్రీరామ్ రెడ్డి, హరికృష్ణ యాదవ్, మోహన్ బెహరా, మురా బెహరా, రఘు బెహరా, జుత్తు కామేష్, జుత్తు బేసింగ్ యాదవ్, నర్తు రాజా యాదవ్, దాసరి నాగరాజు, సాడి జయరామ్ రెడ్డి, ఉప్పాడ జ్యోతిసాయికుమార్, బచ్చు పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మందస ఎస్ఐ కృష్ణప్రసాద్‌కు వాసుదేవుని ఆశీస్సులు

### సేవలకు సన్మానం జరిపిన అర్చకులు

**మందస, ఫిబ్రవరి 28(వార్త):** శ్రీవాసుదేవుని బ్రహ్మోత్సవాలు



అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడా.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు చేసిన సేవలు అభినందనీయం. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తు.. ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు అసౌకర్యం కలుగకుండా సేవలు, క్యూలైన్ తదితర సేవలు అందించడంలో ఆయన శతశాతం సఫలీకృతమయ్యారు. ఈ మేరకు ఎస్ఐ కృష్ణప్రసాద్ శనివారం కావడంతో శ్రీవాసుదేవ పెరుమాళ్ దర్శనం చేసుకోవడానికి ఆలయానికి వెళ్లారు. దీంతో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్యాచార్యులు, అర్చకులు కృష్ణప్రసాద్ కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కృష్ణప్రసాద్, కుటుంబం పేరిట ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి వారి దుశ్శాలువను కప్పి, అభినందించారు. అనంతరం శ్రీవాసుదేవుని తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్వామివారి అపురూప దర్శనం, ప్రత్యేక పూజలు తనకు ఎంతో ఆనందం, మంచి అనుభూతి కలిగించాయన్నారు. అర్చకులు వాసుదేవుని ఆశీస్సులు అందించారని సంతోషం వ్యక్తం చేశారు. వాసుదేవుని కనులారా దర్శనం చేసుకున్నానని, స్వామి మూర్తిత్వం భక్తి తన్మయత్వానికి గురి చేసిందన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 3న ధర్నాను విజయవంతం చేయండి : ఏపీటీఎఫ్ నేతలు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 28(వార్త):** ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 3వ తేదీన చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బి.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శనివారం వారు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలవుతున్నా.. ఉపాధ్యాయ, ఉద్యోగుల బకాయిలను విడుదల చేయడంలో జాప్యం చేస్తోందన్నారు. ఎక్కడి గొంగలి అక్కడే అన్న విధంగా ఏళ్ల తరబడి ఉపాధ్యా, ఉద్యోగ వర్గాల సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా ఫలితం మాత్రం కనబడడడం లేదన్నారు. 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను తక్షణమే నియమించి, 29% ఐఆర్ ప్రకటించాలని, సర్వీసు ఉపాధ్యాయులకు టెట్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల బోధనకు అడ్డంకిగా మారిన ఆన్‌లైన్ పని ఒత్తిడిని, అదనపు భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.



# స్వచ్ఛ గ్రామాల దిశగా ముందడుగు

### - పంచాయతీలకు వాహనాలు

### పంపిణీ చేసిన ఎమ్మెల్యే రమణమూర్తి




**నరసన్నపేట, ఫిబ్రవరి 28(వార్త):** గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి స్వచ్ఛ గ్రామాలుగా అభివృద్ధి చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చెత్త సేకరణ మరియు పారిశుధ్య నిర్వహణ కోసం 13 ట్రై సైకిళ్లు, ఒక ట్రక్ మరియు రెండు ట్రాక్టర్లను గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత ప్రజల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని తెలిపారు. చెత్తను సమయానికి సేకరించి, శాస్త్రీయ విధానంలో నిర్వహించడం ద్వారా వ్యాధులను నివారించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, అందజేసిన వాహనాలు ఆ దిశగా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పంచాయతీలకు అందించిన ట్రై సైకిళ్లు, ట్రక్కులు, ట్రాక్టర్లను సద్వినియోగం చేసుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజలు కూడా పారిశుధ్యం పట్ల అవగాహన పెంచుకుని స్వచ్ఛతకు సహకరించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి పరిశుభ్రతతోనే ప్రారంభమవుతుందని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పారిశుధ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులతో సివిల్ జడ్జి సమీక్ష



**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** పోలీస్ అధికారులతో జూనియర్ సివిల్ జడ్జి యు. మాధురి శనివారం తన ఛాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాశీబుగ్గ, వజ్రపు కొత్తూరు పోలీస్ అధికారులతో పలాస ఎక్సైజ్ అధికారులతో సమావేశమును నిర్వహించారు.అధిక సంఖ్యలో క్రిమినల్ కేసులు పరిష్కారం కావాలని ఆ దిశగా అందరూ చర్యలు చేపట్టి కోర్టువారికి అదే విధంగా మండల్ న్యాయ సేవ సంఘంకి సహకరించి ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ అర్బన్ సి ఐ రామకృష్ణ, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతి రావు, ఎక్సైజ్ ఎస్సై రవిశంకర్, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుపైనే డ్రైనేజీ నీరు... స్థానికుల ఆవేదన



**నరసన్నపేట, ఫిబ్రవరి 28 (వార్త):** బొరిగివలసలోని సంతోషిమాత ఆలయం ఎదురుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని వారు తెలిపారు. భరించలేని దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి అధికమైందని, విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు అసౌకర్యానికి గురవుతుండటంతో పాటు చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు.

## పేదల కన్నీరు తుడిచిన ఎన్టీఆర్ భరోసా

**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** పేదల గడప దాటిన ఎన్టీఆర్ భరోసా - నేరుగా లబ్ధిదారుల చేతుల్లోకి కిడ్నీ బాధితులకు రూ.10,000లు, బాధలో ఉన్న కుటుంబాలకు బలమైన అండ స్పౌజ్ పెన్షన్ కింద రూ.4,000-- అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. హామీలు కాదు... అమలు మా స్టైల్ -- ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టమైన సందేశం ఇచ్చారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పంచాయితీ పరిధిలోని గునాలపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమం శనివారం పంపిణీ చేశారు. పలాస ఎమ్మెల్యేగౌతు శిరీష కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు పెన్షన్‌లను తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, ఎమ్మెల్యేతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న డొక్కరి జానకి రామయ్య, సాతుపల్లి చిన్నయ్యలకు నూతనంగా మంజూరైన రూ.10,000 చొప్పున పెన్షన్ అందజేశారు. స్పౌజ్ పెన్షన్ కింద గజ్జెల చిన్నమ్మి కు రూ.4,000 పెన్షన్ అందించారు. సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం పూండి బస్టాండ్ వద్ద నూతనంగా ప్రారంభించిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని నియోజవర్గ ప్రజల శ్రేయస్సు, శాంతి, సుభిక్షత కోసం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విటల్, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, టిడిపి సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తాగునీరు వచ్చేదెప్పుడు?

### -సవర బంజీరుపేట ప్రజల ఆందోళన

**సారవకోట, ఫిబ్రవరి 28 (వార్త):** కూర్మనాథపురం పంచాయతీ పరిధిలోని సవర బంజీరుపేటలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. "తాగు నీరు వచ్చేదెప్పుడు?" అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రస్తుతం నీటి సరఫరా జరగడం లేదని వారు తెలిపారు. అప్పట్లో వేసిన కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో వాటి చుట్టూ రాళ్లు వేసి నిరుపయోగంగా వదిలేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా కూడా అంతంత మాత్రంగానే నీరు వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో తాగునీటి కోసం వారు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



# అర్హులందరికీ పింఛన్ అందేలా చర్యలు

### -ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా అందజేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**నరసన్నపేట, ఫిబ్రవరి 28(వార్త):** నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం కోమర్తి పంచాయితీలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరియు ఇతర బలహీన వర్గాల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం పింఛన్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పింఛన్ రూపంలో అందిస్తున్న ఆర్థిక సహాయం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తూ, వారి దైనందిన అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని, కొత్తగా పింఛన్లు కావలసిన వారు దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవడం, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం మరియు సంక్షేమ పథకాలను చేరవేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు వేగవంతం

**నరసన్నపేట, ఫిబ్రవరి 28(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో జనసేన ఉద్యమి క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈసారి మరింత వేగవంతంగా, ఉత్సాహభరితంగా నిర్వహించాలని శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త, చైర్మన్ కొరికాన రవికుమార్ పిలుపునిచ్చారు. నరసన్నపేట నియోజకవర్గ ఇంచార్జీ బలగ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, పాతపట్నం నియోజకవర్గ సమన్వయ కర్త కొరికాన భవాని పాల్గొని కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ బలాన్ని మరింత పటిష్టం చేసే బలమైన ఆయుధమన్నారు. ప్రతి కార్యకర్త గ్రామ స్థాయిలో ప్రజలతో మమేకమై సభ్యత్వ నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. నియోజకవర్గ సాధకులు, తామరపల్లి గ్రామ జనసైనికులు, వీర మహిళలు ఉత్సాహంగా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సంకల్పించారు. ఈసారి నిర్దేశించిన లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు చేసి, నరసన్నపేట నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలో ఆదర్శ నియోజకవర్గంగా నిలపాలని రవికుమార్ పిలుపునిచ్చారు.



## డిగ్రీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం




**నరసన్నపేట, ఫిబ్రవరి 28(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడం, "కారణం-ఫలితం" మధ్య ఉన్న సహసంబంధాన్ని అర్థం చేసుకోవడం ఈ రోజు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విజ్ఞాన శాస్త్రం మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ, సైన్స్ అభివృద్ధి వల్ల మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాలు లభించాయని వివరించారు. ఆధునిక సాంకేతికత, వైద్యం, కమ్యూనికేషన్ రంగాలలో వచ్చిన మార్పులు విజ్ఞాన శాస్త్ర ఫలితమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటింటికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### - లబ్ధిదారులకు స్వయంగా అందజేసిన బగ్గు అర్చన



**జలుమూరు, ఫిబ్రవరి 28(వార్త):** అల్లాడపేట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన స్వయంగా ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరియు ఇతర బలహీన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు వారికి ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తూ, ప్రతి లబ్ధిదారునికి సమయానికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, కళ్యాణం కోటేశ్వరరావు, ఎంపీడీవో, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జీఎఫ్ఎల్ఎన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించండి




**నరసన్నపేట, ఫిబ్రవరి 28 (వార్త):** విద్యాశాఖ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలలో భాగంగా జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలని ఎంఈఓ-2 పేడాడ దాలినాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆయన నరసన్నపేటలోని గొట్టిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల రికార్డులను, బోధన విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ప్రాథమిక చదువు, లెక్కలు నేర్చుకునే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. బోధనతో పాటు ఇతర విద్యా కార్యకలాపాలు, ఆటల ద్వారా నేర్పించడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల సంక్షేమానికి పునాది

**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** పలాస నియోజకవర్గంలోని ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ఒక వరం లాంటిదని ఆమె పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.4,21,190ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నా ప్రథమ కర్తవ్యం. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రతి ఒక్క అర్హుడికి సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాను. ఇది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, మానవతా దృక్పథంతో మనం అందించే భరోసా," అని తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం సైనూరు వాసి గాడి ఈశ్వరరావుకు రూ. 20,000లు, మందస మండలం దున్నవూరుకు చెందిన పిచ్చుక జాస్మిన్‌కు రూ.39,883లు, పలాస మండలం కొత్త ఊరు వాసి తమ్మినాన మౌళికి రూ.2,29,395లు, పలాస మండలం రెంటికోట వాసులు తామరపల్లి శ్రీనివాస్ , తామరపల్లి ధనంకు రూ.1,31,912ల చొప్పున చెక్కులను ఎమ్మెల్యే శిరీష అందజేశారు. ఈ సహాయానికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శిరీషకు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డులు, పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



# చీడివలసలో ఘనంగా జాతీయ సైన్స్ డే




**పోలాకి, ఫిబ్రవరి 28(వార్త):** పోలాకి మండలం చీడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు .. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి, వారి ప్రతిభను అబినందించారు. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. మానవ జీవితంలో సైన్స్ ప్రాధాన్యత, ఉపయోగాలు గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కె.నారాయణలో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

## -'ఇగ్నైట్' సైన్స్ ఎక్స్పో అద్భుత విజయగాథ

## -సైన్స్ తో ప్రపంచానికి ఎంతో మేలు

**మందస, ఫిబ్రవరి 28(వార్త):** సైన్స్ తో ప్రపంచానికి ఎంతో మేలు జరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మందస మండలంలోని కుంటికోటలోని కె.నారాయణ హై స్కూల్ నిర్వహించిన 'ఇగ్నైట్--సైన్స్ ఎక్స్పో, ఇంటర్‌హౌస్ పోటీలు కార్యక్రమం విజ్ఞాన మహోత్సవంగా, సృజనాత్మకత పండుగగా, విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనగా అత్యంత ఘనంగా జరిగాయి. కుంటికోట గ్రామం ఒక చారిత్రాత్మక దృశ్యానికి వేదికైంది. గ్రామీణ ప్రాంతంలో ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ఈ పాఠశాల మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. చిన్నారుల ఆలోచనలు ఎంత గొప్పగా విస్తరించగలవో, వారి కలలు ఎంత ఎత్తుకు ఎగరగలవో ఈ ఎక్స్పో స్పష్టంగా చూపించింది.ముఖ్య అతిథిగా మందస మండల విద్యాశాఖాధికారి-1 మద్రిపాటి లక్ష్మణరావు దీపప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికలే ఇలాంటి సైన్స్ ఎక్స్పోలు... భవిష్యత్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులు ఇలాంటి వేదికల నుంచే రూపుదిద్దుకుంటారని అభినందించారు. 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కోడింగ్ విభాగాల్లో వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల వివరణాత్మక సమాధానాలు, సాంకేతిక అవగాహన, సమస్యలపై విశ్లేషణాత్మక దృక్పథం అందరినీ ఆశ్చర్యపరిచింది. చిన్నారుల మాటల్లో ధైర్యం, వారి ఆలోచనల్లో లోతు, వారి ప్రదర్శనలో నైపుణ్యం స్పష్టంగా కనిపించింది. ప్రతీ స్టాల్ వద్ద తల్లిదండ్రులు, అతిథులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా సందర్శిస్తూ విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలు వారి అధ్యయనంలో ఉన్న పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంత సమర్థవంతంగా ఉందో తెలియజేశాయి. కార్యక్రమం ఇంటర్‌హౌస్ పోటీగా నిర్వహించబడడంతో ఉత్సాహ, సమర్థ్య, ధైర్య, శౌర్య హౌసుల మధ్య ఉత్కంఠభరిత పోటీ నెలకొంది. ప్రతీ హౌస్ తమ అత్యుత్తమ ప్రదర్శనతో ముందుకు రావడానికి ప్రయత్నించింది. చివరికి అత్యధిక మార్కులు సాధించిన హౌసుకు ప్రతిష్టాత్మక ట్రోఫీ ప్రదానం చేయబడింది. విజేతల ముఖాల్లో ఆనందం, ఇతర హౌసుల విద్యార్థుల్లో మరింత మెరుగ్గా రాణించాలనే సంకల్పం స్పష్టంగా కనిపించింది. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలు, ప్రయోగాల ప్రత్యక్ష ప్రదర్శనలు సందర్శకులను మంత్ర ముగ్ధులను చేశాయి. విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాదని, అనుభవంలో నేర్చుకున్న జ్ఞానం జీవితాంతం నిలిచిపోతుందని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మా లక్ష్యం మార్కులకే పరిమితం కాదని,



పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడం మా ధ్యేయమన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచే ప్రపంచ స్థాయి ప్రతిభను తీర్చిదిద్దడం మా సంకల్పమని తెలిపారు. తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, తమ పిల్లల్లో వచ్చిన మార్పులను గమనిస్తున్నామని, ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరారు. మొత్తానికి, ఇగ్నైట్ సైన్స్ ఎక్స్పో కేవలం ఒక కార్యక్రమం కాదని, ఒక విజ్ఞాన జ్యోతి అని, కుంటికోట గ్రామంలో జ్ఞానదీపం మరింత ప్రకాశంగా వెలిగిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని స్థానికులు అన్నారు. గ్రామీణ విద్యార్థుల సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేసే గొప్ప అడుగు ఈ కార్యక్రమం ద్వారా వేయబడిందన్నారు. కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాన్ని అందరూ హృదయపూర్వకంగా అభినందించారు.






## కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం



**మందస, ఫిబ్రవరి 28(వార్త):** కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ గూర్చి, ఆయన కనుగొన్న రామన్ ఎఫెక్ట్ గూర్చి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేసారు. సైన్స్ ఉపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, జి.సూర్యనారాయణలను సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు, ఆయా సైన్స్ ప్రాజెక్ట్ లు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం. చిత్రసేను, జి.చిన్నికృష్ణ, ఎం.దామోదరం జి.గోపాలకృష్ణ, బి.రమేష్, పి.అఖిల, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలు పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు



**సారవకోట, ఫిబ్రవరి 28 (వార్త):** సారవకోట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శనివారం విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు నిర్వహించారు. చీఫ్అశీఖుశ్రీ ౚఘఅవఅఘవ ఖుఎ పురస్కరించుకొని ఆయా పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వివిధ నమూనాలు, ప్రయోగాలు ప్రదర్శించారు. విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టుల పని విధానాన్ని వివరంగా చెప్పి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఎంఈఓలు ఎం.వి. రమణ, భూలక్ష్మి పరిశీలించి విద్యార్థులను అభినందించారు. విజ్ఞాన శాస్త్రం ద్వారా సమాజ అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని వారు సూచించారు.




**శ్రీకాకుళం(బలగ), ఫిబ్రవరి 28(వార్త):** శాంతినగర్ కాలనీ సమీపాన ఉన్న స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల నందు జాతీయ సైన్స్ దినోత్స వం సందర్భంగా, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు పి.సింహాచలం ఆధ్వర్యం లో గిరిజన విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పాఠశాల ఆవరణలో ప్రద ర్శించారు. ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతులుగా వ్యవహరించారు. గెలుపొందిన ప్రదర్శనలకు ప్రధానోపాధ్యా యులు దేవుళ్ల శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**పలాస, ఫిబ్రవరి 28 (వార్త):** ప్రజల నుండి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. 15 రోజుల్లో అధికారులు అర్జీలును ప్రజలకు వివరించాలన్న ఎమ్మెల్యే గౌతు శిరీష. పలాస నియోజకవర్గ ప్రజలు ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు "ప్రజా దర్బార్ " నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా పార్టీ రహితముగా "ప్రజా దర్బార్" నిర్వహించడం పట్ల ప్రజల నుండి హర్షాది రేఖలు వచ్చాయి. గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నాయి. ఈ తరుణంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే శిరీష కృషి పట్ల పలువురు అభినందించారు. మండలం నుండి వచ్చిన ఫిర్యాదులలో భూ వివాదాలు, రెవెన్యూల తోపాటు రహదారుల సమస్యలు, విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు, ప్రధాన సమస్యలే ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. దీనితోపాటు రేషన్ కార్డులు కావాలని, పింఛనులు కావాలని, ఇల్లు స్థలాలు కావాలని, గృహ నిర్మాణాలు చేపట్టాలని, వృద్ధులు వికలాంగులు, వితంతువులు వ్యక్తిగత ఫిర్యాదులు కూడా వచ్చాయి. గత పాలనలో పాలకులు, పాలనపై దృష్టి సాధించక సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడంతో ప్రభుత్వము మారడంతో స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి అనేక సమస్యలు సామాజిక సాంఘిక సమస్యలపై స్పందించి ఫిర్యాదులు ఇవ్వడం



జరిగింది. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి ఈ సమస్యలు త్వరితగతిన పూర్తి చేయాలని తెలియజేశారు. శనివారం ఎమ్మెల్యే నిర్వహించిన "ప్రజాదర్బార్". కార్యక్రమంలో అర్జీలను స్వయంగా స్వీకరించడం జరిగింది.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 28(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో , కుంతీ బడిత్య ,వరద సరస్వతి లాడి జానకమ్మ ,కొండూరి సీతారత్నం లకు నూతనంగా వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి పింఛన్లు కమిషనర్ రమేష్ శనివారం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో గల బెల్లుపడ కాలనీ -03, స్వర్ణ వార్డు 14వ వార్డ్ లో ఇటీవల అనారోగ్యం తో మరణించిన కాండూరి వెంకటరమణ పెన్షనర్ భార్య అయిన కాండూరి సీత రత్నంకి స్పౌజ్ (విడో) కొత్త పెన్షన్ రూ.4000లు మంజూరయ్యింది. ఈ కొత్త పెన్షన్‌ను మున్సిపల్ కమిషనర్ నల్లి రమేష్ 14 వార్డ్ టీడీపీ ఇంచార్జి నందిక జానీ, కార్యకర్తలు లింగరాజు, అసి ధర్మరాజు అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ హుస్సేన్, అడ్మిన్ సెక్రటరీ జీనత్ షేక్, శానిటేషన్ సెక్రటరీ కల్యాణి పాల్గొన్నారు. కేసుపురం గ్రామంలో కిడ్నీ డయాలసిస్ అవుతున్న అంబటి రాజమ్మకి కిడ్నీ పింఛన్ రూ.10000లు,బొమ్మాళి పద్మకి రూ.4000 లు, కేసుపురం, సన్యాసి పట్టుగ, నీలాపుపుట్టుగల్లో 412 కుటుంబాలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ డి.కామేశ్వరరావు, బి.శ్యాంసుందర్, నరేంద్రరెడ్డి, జి.బీమారాజు, పి.పురుషోత్తం, బి.తిరుపతి, బి.కృష్ణమూర్తి, ఎం.జానకరావు, వై.గణపతి, బి.నారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.గౌతమి, డి.తారక్, జయరాం, ఈశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు. 11వ వార్డులో కౌన్సిలర్ ఆసి లీలారాణి, 15వ వార్డులో నందిగామ కోటేశ్వరరావు, సరస్వతి పింఛన్లను పంపిణీ చేశారు



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546